క్లుప్తంగా

వలంటీర్లకు నియామకపత్రాలు అందజేత



వలంటీర్లకు నియామకపత్రాలు అందజేస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ జగన్‌మోహన్‌రావు

సంతకవిటి: మండలంలోని కృష్ణంవలస, గరికిపాడు, మిర్తివలస, జి.ఎస్.పురం, గోళ్లవలస, బొద్దూరు గ్రామాల్లో వలంటీర్లుగా పనిచేసేందుకు ఎంపికైన దాదాపు 8 మందికి జెడ్పీ వైస్ చైర్మన్ ఎస్.జగన్‌మోహన్‌రావు చేతులమీదుగా స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నియామకపత్రాలు మంగళవారం అందజేశారు. చిత్తశుద్ధి, నిబద్ధతతో పనిచేసి, ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి.వి.రవికుమార్, మాజీ వైస్ ఎంపీపీ జి.కేసరి, సర్పంచ్‌లు పి.గణపతి, ఆర్.భూపతి తదితరులు పాల్గొన్నారు.

గ్రామదేవతలకు ముర్రాటలు



అసిరితల్లికి ముర్రాటలు సమర్పించేందుకు వెళ్తున్న భక్తులు

సంతకవిటి: గ్రామదేవతల పండగలో భాగంగా మండలంలోని మండాకురిటి గ్రామంలో అసిరితల్లి, దుర్గమ్మతల్లికి మహిళా భక్తులు మంగళవారం ముర్రాటలు సమర్పించారు. ఈ ఏడాది పంటలు బాగా పండాలని, ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవించేలా చూడాలని మొక్కినట్లు సర్పంచ్ బత్తుల జ్యోతీశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

తల్లిపాలతోనే శిశువుకు ఆరోగ్యం

బొబ్బిలి: తల్లిపాలతోనే శిశువుకు ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ పీఓ విజయలక్ష్మి అన్నారు. మంగళవారం స్థానిక పట్టణంలోని 26వ వార్డులో తల్లిపాల వారోత్సవాలను ప్రారంభించిన ఆమె తల్లి పాల విశిష్టతను వివరించారు. ప్రతీ బిడ్డకు తల్లిపాలే ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ బాలామణి, మున్సిపల్ కౌన్సిలర్ లక్ష్మీరామారావు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం

మెంటాడ: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధుల బారినపడకుండా ఉండవచ్చని పీహెచ్‌సీ వైద్యులు శ్రుతి, లోక్‌ప్రియా అన్నారు. మంగళవారం మండలంలోని లోతుగెడ్డ, ఆంద్ర గ్రామాల్లో సీజనల్ వ్యాధుల బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వారు అవగాహన కల్పించారు. తొలుత గ్రామస్తులతో కలిసి ర్యాలీ చేపట్టిన వారు మలేరియా, టైఫాయిడ్, డెంగీ, చికెన్‌గున్యా వంటి వ్యాధులు రాకుండా ఉండేందుకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా పాటించాలన్నారు. మురుగుకాలువలు, ఇంటాబయట మురుగునీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ త్రివిక్రమ్, తహసీల్దార్ రామకృష్ణ పాల్గొన్నారు.

'ఫ్యామిలీ డాక్టర్'తో ఇంటి వద్దకే వైద్యసేవలు

బొబ్బిలి: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ఇంటి వద్దకే వైద్యసేవలు అందుతున్నాయని ఎంపీడీఓ పి.రవికుమార్ తెలిపారు. మంగళవారం మండలంలోని కలువరాయి గ్రామంలో కార్యక్రమంలో భాగంగా 104 వాహనం ద్వారా వైద్య శిబిరం నిర్వహించి, పలువురికి ఆరోగ్య తనిఖీలు నిర్వహిస్తుండడాన్ని ఆయన పరిశీలించారు. ఇంటింటికీ వెళ్లి, మంచానపడిన రోగులను కూడా సందర్శించి, వారికి వైద్యసేవలందించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం పక్కి గ్రామ పీహెచ్‌సీని సందర్శించిన ఆయన ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందేలా చూడాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు.

'ఆడుదాం ఆంధ్ర'ను విజయవంతం చేయాలి

బొబ్బిలి: ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంను విజయవంతం చేయాలని ఎంపీడీఓ పోతుల రవికుమార్ కోరారు. కార్యక్రమంలో భాగంగా చేపట్టాల్సిన క్రీడల నిర్వహణపై మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. తొలుత సచివాలయ స్థాయి ఆ తర్వాత మండల స్థాయిలో క్రీడాపోటీలు జరిపించేందుకు నిర్ణయించినట్లు సమాచారం. కార్యక్రమంలో ఎంఈఓ చల్ల లక్ష్మణరావు, టీపీఆర్ఓ జగన్‌మోహనరావు, పీడీ వెంకటనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రాజాం: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆగస్టు 15వ తేదీన ప్రతీ గ్రామ సచివాలయ పరిధిలో సచివాలయ స్థాయి క్రీడాపోటీలు నిర్వహించాలని ఎంపీడీఓ బాసూరి శంకరరావు తెలిపారు. ఇదే విషయమై స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అన్ని పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులతో సమావేశమైన ఆయన తొలుత సచివాలయ స్థాయి అనంతరం మండల స్థాయి పోటీలు నిర్వహించాలని సూచించారు. విజేతలకు ఆగస్టు 15వ తేదీన జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో బహుమతులు అందజేయనున్నామన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ అజెండా

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్



ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

వంగర: రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ అజెండా అని ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని మరువాడ, సీతాదేవిపురం గ్రామాల్లో మంగళవారం పర్యటించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు సర్పంచ్ గాడి క్రిష్ణవేణి ఆధ్వర్యంలో ఆయా గ్రామాల ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన వారు ప్రభుత్వం నాలుగేళ్లుగా చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం వివరించారు. అలాగే ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు వారి దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అన్ని వర్గాల ప్రజలు బాగుండాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని, అందుకే కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు రూపొందించి, అమలు చేస్తున్నారన్నారు. దీంతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయన్నారు. మరోవైపు ప్రతీ గ్రామ సచివాలయం పరిధిలో ప్రజలకు అన్ని మౌలిక సదుపాయాలు ఉండేలా అభివృద్ధి పనులు చేపడుతున్నారన్నారు. ఇప్పటికే నాడు-నేడు పనులతో పాఠశాలలు, ఆస్పత్రులను ఆధునీకరించారన్నారు. జగనన్న కాలనీల నిర్మాణంతో పేదల సొంతింటి కళ నెరవేరుస్తున్నారన్నారు. సచివాలయాల ఏర్పాటు ద్వారా లక్షలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇచ్చి, వారికి బాసటగా నిలిచారన్నారు. రానున్న ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, సీఎం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ యు.సురేష్‌ముఖర్జీ వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కె.సుదర్శనరావు, జేసీఎస్ మండల కన్వీనర్ ఎం.విజయలక్ష్మి, ఎంపీటీసీ పి.ప్రేమమ్మ, పార్టీ నేతలు బి.వెంకటరావు, వి.సూర్యనారాయణ, పి.దవళేశ్వరరావు, ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పండగలా పెన్షన్ల పంపిణీ

పెన్షన్ల పంపిణీ పండగలా జరిగింది. మంగళవారం వేకువజామునే వలంటీర్లు లబ్ధిదారుల ఇంటింటికీ వెళ్లి, పెన్షన్ నగదు అందజేశారు. వైఎస్సార్ పెన్షన్‌కానుక పథకం కింద ప్రతినెలా ఒకటో తేదీనే వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం పెన్షన్లు పంపిణీ చేస్తోంది. తొలిరోజు తెర్లాం, రామభద్రపురం మండలాల్లో 90 శాతం, రాజాం మండలంలో 96 శాతం మేర పెన్షన్ల పంపిణీ జరిగినట్లు అధికారులు తెలిపారు. గతంలో లాగా ఇబ్బందులు లేకుండా ఉన్నచోటకే పెన్షన్లు వస్తుండడంపై లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

-బొబ్బిలి, రాజాం సాక్షి నెట్‌వర్క్



వంగర: వృద్ధురాలికి పెన్షన్ అందజేస్తున్న వలంటీర్



రామభద్రపురం శ్రీరామ్‌నగర్ కాలనీలో సచివాలయ కన్వీనర్ శ్రీనివాసరావుతో కలిసి పెన్షన్లు అందజేస్తున్న వలంటీర్ జానకి



రేగిడి: మునకలవలసలో కిడ్నీ వ్యాధిగ్రస్తునికి పెన్షన్ నగదు అందజేస్తున్న సర్పంచ్ చంద్రశేఖర్



రాజాం: నందబలగలో వృద్ధురాలికి పెన్షన్ అందిస్తున్న వలంటీర్



తెర్లాంలో దివ్యాంగురాలికి పెన్షన్ ఇచ్చేందుకు బయోమెట్రిక్ వేయిస్తున్న వలంటీర్ గౌరీశ్వరి

వృద్ధాశ్రమానికి రూ.2 లక్షల ఆర్థికసాయం

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని కొండంపేట గ్రామంలో నిర్మిస్తున్న అనాథ వృద్ధాశ్రమానికి స్థానిక జేసీ క్లబ్ సభ్యులు రూ.2 లక్షల ఆర్థికసాయం మంగళవారం అందజేశారు. మల్లిఖార్జున కాలనీలోని ఆశ్రమంలో కొంతమందికే ఆశ్రయం లభిస్తోందని, దీనిని విస్తృతం చేయాలన్న సంకల్పంతోనే ఆశ్రమ నిర్వాహకులు పి.శ్రీనివాస్ తన సొంత స్థలంలో నూతన భవనాన్ని నిర్మించడం జరుగుతోందని, దీనికి తమవంతు సహకారం అందిస్తున్నామని క్లబ్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో జేసీ క్లబ్ అధ్యక్షుడు సీహెచ్ బదరీసత్యనారాయణ, ఉపాధ్యక్షుడు పి.శ్రీనివాసరావు, కార్యదర్శి ఎస్.పోలారావు తదితరులు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న జేసీ క్లబ్ సభ్యులు

మున్సిపల్ కార్యాలయం ముట్టడి

రాజాం సిటీ: మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులను తక్షణమే పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సీహెచ్ రామ్మూర్తినాయుడు డిమాండ్ చేశారు. ఇదే విషయమై కార్మికులతో కలిసి స్థానిక మున్సిపల్ కార్యలయాలన్ని మంగళవారం ముట్టడించి, ఆందోళన తెలిపారు. ఆయన మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, పట్టణ విస్తీర్ణానికి అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలని కోరారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే ఈ నెల 7వ తేదీన కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు.

వ్యాధుల నివారణపై అవగాహన కల్పించండి

తెర్లాం: సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన కల్పించాలని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ సూచించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీహెచ్‌ఏలు, ఏఎన్‌ఎంలతో సమావేశమైన ఆయన వర్షాకాలంలో టైఫాయిడ్, మలేరియా, డెంగీ వంటి జ్వరాలు అధికంగా ప్రబలే అవకాశం ఉందని, వీటి నివారణ చర్యలపై గ్రామాల్లోని ప్రజలకు చైతన్యం కలిగించాలన్నారు. అలాగే పారిశుద్ధ్య పనులను ముమ్మరం చేయాలన్నారు. రక్తహీనతతో బాధపడే గర్భిణులు, చిన్నారులను గుర్తించి, పౌష్టికాహారం తీసుకునేలా సూచనలు, సలహాలు చేశారు. ఫీవర్ సర్వే శతశాతం నమోదు చేయాలన్నారు. ఈ నెల 10వ తేదీన నులుపురుగుల నివారణ దినోత్సవం ఉందని, ఈ సందర్భంగా నులిపురుగు నివారణ మాత్రల పంపిణీ శతశాతం పూర్తి చేయాలన్నారు.

లేగదూడలతో మేలుజాతి పశుసంపద

వంగర: లేగదూడల పెంపకంలో జాగ్రత్తలు పాటిస్తేనే మేలుజాతి పశుసంపదను తయారు చేయవచ్చని ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, వైస్ ఎంపీపీ కిమిడి ఉమామహేశ్వరరావు అన్నారు. మంగళవారం మండలంలోని ఎం.సీతారాంపురం గ్రామంలో ఏర్పాటు చేసిన లేగదూడల ప్రదర్శనను తిలకించిన ఆయన పశు సంపద, పాడిపరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం తోడ్పాటునందిస్తోందన్నారు. శ్రీకాకుళం డీఎల్‌డీఓ శివ్వాల మన్మధరావు మాట్లాడుతూ పాడి పశువులు ఎద కాలం గుర్తించి, అందుబాటులో ఉన్న సచివాలయం, ఆర్‌బీకేల వద్ద జెర్సీ, హెచ్ఎఫ్, ఒంగోలు కృత్రిమ గర్భాధారణ ఇంజెక్షన్లు ఇప్పించాలన్నారు. కార్యక్రమంలో రాజాం, సంతకవిటి ఏడీలు జయప్రకాష్, సత్యప్రకాష్, పశువైద్యాధికారులు అనీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



లేగదూడల ప్రదర్శనను తిలకిస్తున్న ఎంపీపీ సురేష్‌ముఖర్జీ

పక్కాగా ఓటర్ల జాబితా

- ఓటరు సర్వే పరిశీలనలో ఆర్‌డీఓ పి.శేషశైలజ

తెర్లాం: పక్కాగా ఓటర్ల జాబితా తయారు చేయాలని ఆర్‌డీఓ పి.శేషశైలజ అన్నారు. మండలంలోని కూనాయవలస గ్రామంలో జరుగుతున్న ఓటరు సర్వేను మంగళవారం పరిశీలించిన ఆమె సర్వే జరుగుతున్న తీరుపై ఆరాతీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఓటర్ల జాబితాల్లోని ప్రతీ ఓటరుకి సంబంధించిన ఇంటి నంబరును తప్పనిసరిగా నమోదు చేయాలని బీఎల్‌ఓలకు సూచించారు. అలాగే ఓటరు జాబితాల్లో ఓటరు ఫొటో, పేరు, ఇంటి నంబరు, జెండర్, వయసు వంటివి సరిగా ఉన్నవీ లేనివీ చూసి, తప్పులుంటే సరిచేయాలన్నారు. దీంతో పాటు మృతి చెందిన ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగించాలన్నారు. శాశ్వతంగా గ్రామం నుంచి వెళ్లిపోయిన వారి పేర్లు, వివాహం జరిగి వేరే ప్రాంతాల్లో ఉంటున్న వారి పేర్లను ఓటర్ల జాబితాలను తీసేయాలన్నారు. 2024 జనవరి 1 నాటికి 18 ఏళ్ల వయసు నిండిన వారందరినీ కొత్తగా ఓటర్లుగా నమోదు చేయాలని, అలాగే దీనిపై యువతీ, యువకులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ డి.రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాడంగి: మండలంలోని రామచంద్రాపురంలో నిర్వహిస్తున్న ఓటర్ల సర్వేను ఆర్‌డీఓ పి.శేషశైలజ మంగళవారం పరిశీలించి, బీఎల్‌ఓలకు పలు సూచనలు చేశారు. ఇంటింటికీ వెళ్లి, ఓటర్ల వివరాలపై ఆరాతీసి, ఖచ్చితమైన ఓటర్ల జాబితా తయారు చేయాలని తెలిపారు. విధి నిర్వహణలో అలసత్వం వహించవద్దన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ అజు రఫీజాన్ తదితరులు పాల్గొన్నారు.



బాడంగి: ఓటరు సర్వే అధికారులకు సూచనలిస్తున్న ఆర్‌డీఓ శేషశైలజ

రాజాం: ఓటరు సర్వేకు ప్రతిఒక్కరూ సహకరించాలని రాజాం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి కె.పద్మలత కోరారు. మంగళవారం మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో మండలానికి సంబంధించి, పలు రాజకీయ పార్టీల నేతలతో పాటు మండలంలోని బీఎల్‌ఓలతో సమీక్ష సమావేశం నిర్వహించిన ఆమె ప్రస్తుతం జరుగుతున్న ఓటరు సర్వేపై ఆరాతీశారు. బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి, ఓటరు సర్వే నిర్వహిస్తున్నప్పుడు ఏవైనా అభ్యంతరాలు ఉంటే ప్రజాప్రతినిధులు బీఎల్‌ఓల దృష్టికి తీసుకురావాలన్నారు. రాజాం పట్టణంతో పాటు మండలంలో మొత్తం 82 పోలింగ్‌స్టేషన్లు ఉన్నాయని, 37,359 మంది పురుష ఓటర్లు, 36,623 మంది మహిళా ఓటర్లు, మరో 15 మంది ఇతరులు ఓటర్లుగా నమోదయ్యారని, వీరందరి వివరాలు సరిచూసి, పక్కా ఓటర్ల జాబితా తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.కె.రాజు, ఎన్నికల డీటీ ప్రకాష్‌రాజు తదితరులు పాల్గొన్నారు.



రాజాం: రాజకీయ పార్టీల నేతలతో మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి పద్మలత

రేగిడి: ఓటరు సర్వే సక్రమంగా నిర్వహించాలని బీఎల్‌ఓలకు రాజాం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి కె.పద్మలత సూచించారు. మంగళవారం మండలంలోని ఆమదాలవలస గ్రామంలో నిర్వహిస్తున్న ఓటరు సర్వేను పరిశీలించిన ఆమె ఓటర్ల జాబితాలో తప్పొప్పుల సవరణతో పాటు మృతి చెందిన, శాశ్వతంగా వేరేచోటకు వలసవెళ్లిపోయిన ఓటర్లను జాబితా నుంచి తొలగించాలని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ టి.కల్యాణచక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల నేతలతో ఆర్‌డీఓ పి.శేషశైలజ మంగళవారం సమావేశమై, ఓటర్ సర్వేకు సహకరించాలని కోరారు. బీఎల్‌ఓలంతా ఇంటింటికీ వెళ్లి, ఓటర్ల సర్వే చేస్తున్నప్పుడు ఓటరు వివరాల్లో ఏవైనా తప్పొప్పులుంటే దగ్గరుండి సరిచేసుకోవాలని తెలిపారు. సమావేశంలో తహసీల్దారు డి.రాజేశ్వరరావు, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'గడప గడప'న ఘనస్వాగతం



బొబ్బిలి: కమ్మవలసలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే సోదరులకు సాదరస్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

- ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మేలు వల్లే ఈ గౌరవం
- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే శంబం

బొబ్బిలి: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామ గ్రామాన పర్యటిస్తున్న తమకు ప్రజల నుంచి ఘనస్వాగతం లభిస్తోందని, ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మేలు వల్లే తమకు ఈ గౌరవమని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. మంగళవారం మండలంలోని కమ్మవలస గ్రామంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు గ్రామస్తులు బ్రహ్మరథం పట్టారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఎమ్మెల్యే నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా, అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వం అందిస్తోందన్నారు. అన్ని వర్గాల ప్రజలు బాగుండాలన్నదే సీఎం జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని, అందుకే ఆయన ప్రతీ ఇంటికి మేలు జరిగేలా పథకాలు రూపొందించి, అమలు చేస్తున్నారన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని దాదాపు 99 శాతం హామీలు నెరవేర్చిన ఘనత ఆయనదేనన్నారు. ఇప్పటివరకు అమలైన ఏ ఒక్క పథకంలోనూ ఇంతవరకు అవినీతి జరిగిందన్న దాఖలాలు లేవని, ఇదే ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శమన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు అందుతుండడంతో ప్రజలంతా సంతోషంగా ఉన్నారన్నారు. ఓ వైపు అభివృద్ధి, మరోవైపు నిర్విరామంగా సంక్షేమ పథకాల అమలు ఒక్క వైఎస్సార్ సీపీతోనే సాధ్యమన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, సీఎం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఎస్.వేణుగోపాలనాయుడు, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ టి. దామోదరరావు, ఎంపీడీఓ పి.రవికుమార్, సర్పంచ్ పి.వసుంధర పాల్గొన్నారు.

గ్రామస్వరాజ్య స్థాపనే సీఎం జగన్ ధ్యేయం

- ఆర్‌బీకే ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

వంగర: గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్య స్థాపనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ తెలిపారు. మంగళవారం మండలంలోని కింజంగి గ్రామంలో రూ.21.80 లక్షల నిధులతో కొత్తగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని వారు ప్రారంభించారు. విత్తనాల దగ్గర నుంచి ఎరువులు, పురుగుమందులు, యంత్రపరికరాల వరకు ఆర్‌బీకేల్లో అందుబాటులో ఉంటున్నాయన్నారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, రైతులు సాగు చేస్తున్న పంటలు కొనుగోళ్లు చేసేందుకు ప్రతీ రైతు భరోసా కేంద్రం ఓ వేదిక అవుతోందన్నారు. పండించిన పంటలను రైతులకు గిట్టుబాటు ధరతో పాటు నచ్చిన ధరకు అమ్ముకునేందుకు వెసులుబాటు ఈ ఆర్‌బీకేల ద్వారా లభిస్తోందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రైతు భరోసా కేంద్రాల ఏర్పాటు చరిత్రాత్మక నిర్ణయమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ యు.సురేష్‌ముఖర్జీ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కె.సుదర్శనరావు, జేసీఎస్ మండల కన్వీనర్ ఎం.విజయలక్ష్మి, సర్పంచ్ జి.విజయ, ఎంపీటీసీ పి.ప్రేమమ్మ, ఎంపీడీఓ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ఆర్‌బీకే శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్

మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు

వంగర: వరిసేద్యంలో రైతులు మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏఓ తట్టికోట కన్నబాబు తెలిపారు. మంగళవారం మండలంలోని కొప్పర గ్రామంలో వరినారు తీత, ఉభాలు వేయడాన్ని పరిశీలించిన ఆయన వరినారు కొనభాగం కొంత కత్తిరించి, నాట్లువేస్తే చీడపీడల నుంచి పైరుకు రక్షణ కలుగుతుందన్నారు. ఏ రకం నేలలో ఏ పంట వేసుకుంటే బాగుంటుందన్న విషయం కూడా తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ పి.శివసాయి పాల్గొన్నారు.

రేగిడి: మండలంలోని చాటాయవలస గ్రామంలో వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి జి.మురళీకృష్ణ అధిక దిగుబడికి రైతులకు పలు సూచనలు చేశారు. వరినాట్లు వేసేటప్పుడు క్రమపద్ధతి పాటించాలన్నారు. పంటకు గాలి, వెలుతురు బాగా తగిలేలా నాట్లు వేసుకోవాలన్నారు. అలాగే నాట్లు వేసే ముందు నారు చివరి భాగాన్ని తొలగించి, నాటుకోవాలన్నారు. ఎకరాకు 5 కేజీల యూరియా, 5 కేజీల డీఏపీని దమ్ములో వేసుకుని, నాట్లు వేయాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం సిబ్బంది తవిటినాయుడు, రమణ తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ

రాజాం సిటీ: మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని జెడ్పీటీసీ సభ్యుడు బండి నర్సింహులు అన్నారు. మంగళవారం మండలంలోని పెనుబాక గ్రామంలోని అమృత్ సరోవర్ చెరువు గట్టుపై పెంచుతున్న కొబ్బరి మొక్కల సంరక్షణ పనులను ఆయన పరిశీలించారు. మొక్కలతోనే మానవ మనుగడ ఆధారపడి ఉందని, ఆహారంతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణం అన్నీ మొక్కలతోనేనన్నారు. ఈ నేపథ్యంలో ప్రతిఒక్కరూ తమవంతు బాధ్యతగా మొక్కలు నాటి, పరిరక్షించాలన్నారు.

మళ్లీ వచ్చిన గజరాజులు



సరసనాపల్లిలో అర్ధరాత్రి వేళ సంచరిస్తున్న గజరాజులు



వివరాలు సేకరిస్తున్న అధికారులు

రేగిడి: మండలంలోని సరసనాపల్లి గ్రామంలోకి సోమవారం అర్ధరాత్రి తర్వాత గజరాజుల గుంపు మళ్లీ చొరబడ్డాయి. పైల కామేశ్వరరావుకు చెందిన నూర్పిడి యంత్రాన్ని బోల్తావేశాయి. వేకువజామున పొలాల్లోకి చేరి నూర్పిడిచేసి ఉంచిన మొక్కజొన్న గింజల బస్తాలను చెల్లాచెదురు చేశాయి. ఏనుగులు గ్రామంలోకి చొరబడిన సమయంలో గ్రామస్తులు గుప్‌చుప్‌గా ఉండడంతో ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న జిల్లా అటవీశాఖ డిప్యూటీ రేంజర్ సుధీర్, బీట్ ఆఫీసర్ స్వప్న తదితరులు గ్రామానికి చేరుకుని స్థానికులను అప్రమత్తం చేశారు. గుంపులుగా గ్రామాల్లో తిరగవద్దని ఎస్ఐ ఇ.శ్రీనివాసరావు, తహసీల్దార్ టి.కళ్యాణచక్రవర్తి సూచించారు.

సినిమా థియేటర్లలో ఆకస్మిక తనిఖీలు

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని సినిమా థియేటర్లలో తహసీల్దార్ డోల రాజేశ్వరరావు మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు థియేటర్లలో వీక్షకులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. నిబంధనల ప్రకారం థియేటర్ల నిర్వహణ ఉండాలని యాజమాన్యానికి సూచించారు.